# నిర్దోషి

**దేవరకొండ వెంకటలక్ష్మి**

"టంగ్..... టంగ్" అని గోడ గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. కిటికీలో నుండి ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణాలను తదేకంగా చూస్తూ గంభీరమయిన ఆలోచనలో వున్నాడు రవితేజ.

తండ్రి చేసిన పనికి తన మనస్సు తనను నిందిస్తుంటే భరించటం చాలా కష్టంగావుంది. అంతా చేసిన తండ్రి హాయిగానే వున్నారు. తనెందుకు యిలా క్షోభపడుతున్నాడో తనకే అర్థంకావటంలేదు.

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ రోడ్డుమీద నుండి కోలాహలం వినిపించింది. చటుక్కున కిటికీ దగ్గరకు వెళ్ళి తొంగిచూశాడు రవితేజ.

మేడమీద గది కావటంతో క్రింది రోడ్డుమీద జరిగేదంతా స్పష్టంగా కనబడుతుంది.

రోడ్డుమీద గుంపులుగా జనం, వారిని అదిలిస్తూ పోలీసులు. వారిమధ్య కరెంటు తీగలు చుట్టుకుని మాష్టారి శవం.

మాష్టారి శవం కనిపించగానే బాధగా కళ్ళు మూసుకున్నాడు రవితేజ. కళ్ళల్లో నిండిన బాధ చెంపల మీదుగా జారి షర్టుమీద పడి యింకిపోయింది.

రోడ్డుమీద ఆ హడావుడికి కారణం అతని మనస్సులో సుళ్ళు తిరిగింది.

* * *

ఆ రోజు తను కాలేజీ నుండి నడిచి వస్తున్నాడు. స్కూటర్ రిపేరింగ్ రావటంతో మెకానిక్ షాపులో ఇవ్వవలసి వచ్చింది.

తనకు అతి సమీపంగా వెనక ఎవరో నడుస్తున్నట్టనిపించి భుజాల మీదుగా వెనక్కు చూశాడు.

తన వెనక నడుస్తున్న ఆయన తనను చూసి చిన్నగా నవ్వి "నేను ఎవరో తెలుసా బాబు...!" అన్నారు తన ప్రక్కగా వస్తూ.

ఆయనను ఎక్కడో చూసిన గుర్తుంది తనకు.

"మీ మేడ ప్రక్క ఇంటిలో పది వాటల వాళ్ళు అద్దెకుంటున్నారుకదా! అందులో మేము ఒక వాటావాళ్ళం. నువ్వు నన్ను చూసి వుండకపోవచ్చు. కాని నేనుమాత్రం రోజూ నిన్ను చూస్తున్నాను.

నీ నడవడి చూస్తుంటే ఎందుకో నీతో స్నేహం చెయ్యాలనిపించింది. అందుకే పలకరించాను. నేను ఎలిమెంటరీ స్కూలు మాష్టారుగా పనిచేస్తున్నాను" ఆ మాట తీరు, ఆ ముఖంలో పోలికలు ఎక్కడో చూసినట్టుంది.

తను రెండు మూడుసార్లు ఆయనను వాళ్ళ గుమ్మంలో చూడటం జరిగింది. కాని ఎందుకో అంతగా పట్టించుకోలేదు. ఆయన విషయమే కాదు తనసలు ఏ విషయము అంతగా పట్టించుకోడు.

తనపనేదో తన లోకమేదో తనది. కాలేజీ నుండి వచ్చి నేరుగా తన గదిలోకి వెళ్ళిపోతాడు. ఒక్క భోజనానికి మాత్రమే క్రిందకు దిగుతాడు. అది.... తన అలవాటు.

కాని ఇంత సన్నిహితంగా మాష్టార్ని చూస్తుంటే ఏవేవో పాత జ్ఞాపకాలు మనస్సులో మెదులుతున్నాయి.

సడన్‌గా చిన్ననాటి సంఘటన ఒకటి గుర్తు వచ్చింది. తను ఎలిమెంటరీస్కూల్లో చదువుతున్న రోజులవి.

స్కూల్ లోపల కాంపౌండ్ వాల్‌ని అనుకుని స్కూలు చుట్టు పది వరుసల్లో అనేకరకాల పూల మొక్కలు పెంచేవారు శంకరం మాష్టారు. ఆ మొక్కలు విరబూసి రంగు రంగుల హరివిల్లులా వుండేది.

అన్ని రంగుల పూల మధ్య స్కూలు దివ్యంగా వెలిగిపోతువుండేది. అందువలనే తమ స్కూలుకి మంచిపేరువుండేది. మాష్టారు మొక్కల్ని ఎంతశ్రద్ధగా పెంచేవారో, పిల్లలకు పాఠాలు కూడా అంత శ్రద్ధగా చెప్పేవారు. అందరిలోకి మాష్టారికి తనంటే ఎంతో ఇష్టం.

తమ బడికి జిల్లా లెవెల్లో మంచి పేరు వుంది. అంత ప్రతిష్టవెనుక దాగివున్నది మాష్టారు అహర్నిశలు చేసిన శ్రమ. అందుకే శంకరం మాష్టారంటే హెడ్‌మాష్టారికి మహాయిష్టంగా వుండేది. అది మిగిలిన మాష్టార్లకి కంటక ప్రాయంగా వుండేది.

ఇలావుండగా ఒకరోజు మాష్టారు ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఆ మరునాడు తను బడికి వెళ్ళేసరికి పువ్వులన్నీ నలిపివేయబడి, ఆకులన్నీ రాలిపోయి, మొక్కలన్నీ విరిచివేయబడి వున్నాయి.

మాష్టారు పెంచే ఆ తోట అంటే తన కెంతో యిష్టం. రోజు వచ్చి ఆ తోటలో కాస్సేపు కూర్చునివెళ్ళటం తనకు అలవాటయ్యింది. అలాటి తోట యిలా సర్వనాశనం అయిపోయిన దృశ్యం చూసేసరికి తను తట్టుకోలేకపోయాడు.

కళ్ళల్లో ఉబికి వచ్చే కన్నీటిని అతిప్రయత్నం మీద ఆపుకుంటు వెళ్ళి ఆ మొక్కల మధ్య నిలుచున్నాడు అయోమయంగా.

ఈలోగా శంకరం మాష్టార్ని వెంటబెట్టుకుని తను వున్నచోటుకి వచ్చారు నారాయణరావు మాష్టారు. తోటను చూసి అక్కడే బిగుసుకుపోయారు మాష్టారు.

"చూశారా మాష్టారూ! అంతా నాశనం చేసి ఏమి తెలియనివాడిలా ఎలా చూస్తున్నాడో వెధవ. నేను రోజూ చూస్తున్నాను. వీడు ఈ మొక్కల దగ్గరకు రావటం, దొంగతనంగా ఒకటి రెండు పువ్వులు కోసిపడేయ్యటం. చిన్న తనంలే అనుకుంటే ఆఖరికి వీడు యింతపని చేస్తాడనుకోలేదు." నారాయణ రావు మాష్టారు చెప్పిన మాటలకు నిర్ఘాంత పోయాడు తను.

శంకరం మాష్టారు నీరు నిండిన కళ్ళతో తనవైపు చూశారు. ఆ చూపులోని భావం తను జీవితంలో మరచిపోలేదు. ఆయన తనను కొట్టలేదు, తిట్టలేదు. అంతకన్నా పెద్ద శిక్షవేశారు.

"ఛీ.....! జీవితంలో నాకు నీ ముఖం చూపించకు." అనేసి వెళ్ళిపోయారు. అదిగో అప్పటి నుండే తను మరీ స్తబ్దంగా అయిపోయాడు.

అప్పటి నుండి తను జీవితంలో అతి ముఖ్యమయినది ఏదో పోగొట్టుకున్నట్టు బాధపడుతూనే వున్నాడు.

ఆ తరువాత శంకరం మాష్టారు నిజంగానే తనకు కనిపించలేదు. ఆయిన ఆ వూరునుండి బలవంతంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని తెలిసింది. అప్పటికి ఇప్పుడిదిగో యిలా కనిపించారు.

ఆనాటి రవితేజ తనే అని తెలిస్తే, ఇప్పుడు కూడా ఇంత సన్నిహితంగా మాట్లాడే మాష్టారు ఛీదరించుకుని వెళ్ళిపోతారేమో!! అన్న భావం రాగానే ఒళ్ళు ఝల్లుమంది తనకు.

ఆనాడు ఆపని తను చెయ్యలేదని చెప్పాలన్న కోరిక అతి కష్టం మీద ఆపుకున్నాడు.

ఆనాడు మిగిలిన మాష్టార్లందరు నారాయణ రావు మాష్టారి మాట బలపరచటంతో ఆపని చేసింది తనే అని నమ్మారు శంకరం మాష్టారు. అప్పుడు అలా ఎందుకు జరిగిందో తనకే తెలియదు. శంకరం మాష్టారిమీద వున్నట్టు తనమీద కూడా అందరికీ కోపం వుండేదేమో!

"ఏమిటి బాబు! ఏదో ఆలోచిస్తున్నట్టున్నావ్?" మాష్టారు అనడంతో ఉలికిపాటుగా ఆయనవైపు చూశాడు తను.

జీవితంలో తను పోగొట్టుకున్నది తిరిగి

పొందాలంటే మాష్టారి స్నేహం తను మళ్ళీ చెయ్యగలగాలి. ఆ అదృష్టం తనకుందా! ఏమో!

"మాష్టారు....! మీతో స్నేహం చెయ్యగలిగే అంత అదృష్టం నాకు వుందా అనిపిస్తోంది సార్. అంత అర్హత నాకు ప్రసాదించినందుకు మీకు పాదాభివందనం చెయ్యాలనివుంది సార్" తన్మయంగా తను అంటుంటే మాష్టారు విస్మయంగా చూశారు

"నిజమేసార్! మీరు మరోలా అనుకోకపోతే రోజూ మీరు నేను కలసి వెడితే బాగుంటుందనిపించేది రోజూ నాకు. మీరు అభ్యంతరం చెప్పకపోతే నా స్కూటర్‌మీద రోజూ మిమ్మల్ని డ్రాప్‌చేస్తానుసార్" అభ్యర్థనగా తను అడిగాడు.

కాని మాష్టారు ఒప్పుకోలేదు. "అంతమాటన్నావు అంతే చాలుబాబూ!" అనేశారు.

"మాష్టారు....! పోని మీకు ఎప్పుడు ఎలాటి అవసరం వచ్చినా ఈ రవి వున్నాడని మరచిపోకండి" తను దీనంగా అడుగుతుంటే ఆశ్చర్యపోయారు మాష్టారు.

ఆ తరువాత ఏవేవో మాట్లాడుకుంటూ ఇల్లు చేరారు ఇద్దరు. తమ ఇల్లు రాగానే "వెళ్ళివస్తాను బాబు" అంటు వెళ్ళిపోయారు మాష్టారు. ఆయన వెళ్ళినవైపే పదినిమిషాలు చూస్తూవుండి పోయాడు తను. ఆ రోజు ఎంతో సుదినం తనకు.

తరువాత నెలరోజులు ఎంతో ఆనందంగా గడచిపోయాయి. మాష్టారితో మాట్లాడిన క్షణాలన్నీ మదురమైన క్షణాలే.

ఒకరోజు మాష్టారు తనకోసమే ఎదురు చూస్తున్నట్టుగా తను కాలేజీ నుండి వచ్చేసరికి ఆయన ముఖంలో రంగులు మెరిశాయి. గబగబా తనదగ్గరకు వచ్చారు.

"బాబు! నీతో అవసరం రాకూడదనే అనుకున్నాను. కాని భగవంతుని నైజం ఏమిటో తెలియదు. మనిషి ఏదయితే జరగకూడదను కుంటాడో అదే జరగాలని నిర్ణయిస్తాడు లేమితనం స్నేహాన్ని విడదీస్తుందయ్యా! అయినా తప్పనిసరి."

'ఏం కావాలో చెప్పండి మాష్టారు ఏ కెప్పుడొ





చెప్పాను. మీ కోసం ఈ రవి ఏమయినా చేస్తాడని." ఆయనకు తనతో అవసరం పడినందుకు చాలా సంతోషంగావుంది తనకు.

మాష్టారు తటపటాయిస్తున్నారు.

"మాష్టారు..... ! నా దగ్గర కూడా సంశయిస్తున్నారా! నెల రోజుల నా పరిచయంలో మీరు నన్ను ఏం తెలుసుకున్నారు? ఫరవాలేదు చెప్పండి మాష్టారు" తను మళ్ళీ అన్నాక మాష్టారు ఒకసారి తన ముఖంలోకి చూశారు.

"నాకు రెండు వందలు అప్పుకావాలి బాబు. సాయంత్రం వరకు ఎక్కడా దొరక్కపోతే నీ అవసరం పడుతుంది. దొరికితే రాను. అవసరం వస్తే నేనే వచ్చి అడుగుతాను. నీవుమాత్రం మా ఇంటికి వచ్చి ఇవ్వకేం" అలా అడుగుతున్నప్పుడు ఆయన అభిమానంతో కుచించుకుపోయారు.

"అలాగే మాష్టారు. తప్పకుండా ఇస్తాను" అన్నాడు తను.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల వరకు ఎదురుచూశాడు తను. కాని మాష్టారు రాలేదు. పోనీ ఇంటికే తీసుకు వెళ్ళి ఇద్దామంటే అలా వొద్దన్నారు.

పాపం డబ్బు అర్జంటు అని చెప్పారు. తెల్లవారు ఝామునే ఊరు వెళ్ళాలన్నారు. ఒకవేళ డబ్బు సర్దుబాటు అయ్యిందేమో.

మరో పది నిమిషాలకు ఎవరో వీధి తలుపు కొట్టిన చప్పుడయింది. క్రిందకు వెళ్ళి తీసి చూద్దామను కున్నాడు. కాని ఈలోగా ఎవరో తలుపుతీసిన చప్పుడయింది.

ఎవరో తీశారు కదా అని తను బద్ధకించాడు. మరో పదినిమిషాలకు తలుపులు మూసిన చప్పుడయింది. తనగురించి మాష్టారు వస్తే తనను తనవాళ్ళే పిలుస్తారు కదా అని వూరుకున్నాడు తను.

రాత్రి పదింటింకి మొదలయ్యింది బ్రహ్మాండమయిన గాలివాన. అది మొదలయిన పావుగంటకు పోయింది కరెంటు

సీలింగ్ ఫ్యాను ఆగిపోవటంతో తను ఉక్కగా వుందని వెళ్ళి కిటికీ తలుపులు తీసాడు. బయట అంత వర్షం పడుతున్నా లోపల ఉక్కగానేవుంది.

తను కిటికీ తలుపులు తీస్తున్న సమయంలో నే ఆ చీకటిలో తనకు క్రింద రోడ్డుమీద ఏదో అస్పష్టంగా కనబడింది. కాని తను అంతగా పట్టించుకోలేదు. ఆ చీకటిలో అదేమిటో తనకు సరిగ్గా అర్ధంకాలేదు కూడాను.

నెమ్మదిగా బెడ్‌మీద వాలిపోయాడు. ఆ రోజు కాలేజీలో వర్కు ఎక్కువగా వుండటం వలన ప్రాణం అలసిపోయివుంది. అందుకేనేమో బెడ్‌మీద వాలగానే నిద్రపట్టేసింది.

గోడగడియారం మూడు గంటలు కొట్టింది. ఉలికిపాటుగా లేచాడు తను. కిటికీలో నుండి ఆకాశం కాటుక రాసుకున్నట్టు కనబడుతోంది.

అంటే రాత్రి మూడయినా యింకా కరెంట్ రాలేదన్నమాట. ఇంతలో మాష్టారి విషయం చటుక్కున గుర్తువచ్చింది.

ఇంత కటిక చీకటిలో మాష్టారు బస్‌స్టాండుకు వెళ్ళటానికి యిబ్బందిపడతారేమో! తను ఆయనను స్కూటర్‌మీద దిగబెడితే బాగుంటుంది.

అలా అనుకోగానే వెంటనే లేచి టార్చిలైటు తీసుకుని బయటకు నడచాడు.

తన గదిలో తనవాళ్ళు ఎప్పుడు వెలిగించారో కాని కిరసనాయల్ దీపం గాలికి రేపరెపలాడుతున్నా పట్టించుకోకుండా క్రిందకు వచ్చాడు తను.

వీధి గడప కాలికి గట్టిగా తగిలి ముందుకు తూలి పడబోయి నిలద్రొక్కుకున్నాడు. బొటనవ్రేలు చిట్లి రక్తం చిమ్మింది.

వీధి గేటు దగ్గరకొచ్చి నిలుచున్నాడుకాని మాష్టారి ఇంట్లో ఎవ్వరు లేచినట్లులేదు. తను నిలబడిన చోటుకి మాష్టారు వుండేవాటా క్లియర్‌గా కనబడుతుంది.

రాత్రి గాలివానకి రోడ్డు అంతా అస్తవ్యస్తంగా వున్నట్టు కనబడుతోంది. చీకటి ఏమాత్రం తగ్గలేదు. ఎక్కడా ఏ వస్తువు క్లియర్‌గా కనబడటం లేదు.

మాష్టారు వెళ్ళిపోయి వుంటారు. అందుకే హడావుడి తగ్గినతరువాత వాళ్ళందరు పడుకునివుంటారు. అనుకుని తను మళ్ళీ లోపలకు వచ్చేశాడు.

"ఎక్కడికి వెళ్ళావురా...?" తండ్రి ప్రశ్నకు జవాబు చెప్పలేధు. నేరుగా తన గదిలోకి వచ్చేశాడు. అక్కడ దీపం ఆరిపోయివుంది. టార్చి సహాయంతో దీపం వెలిగించి మంచంమీదకు చేరాడు.

ఎందుకో మనస్సేమీ బాగోలేదు. వీధిగడప కాలికి తగలటం అపశకునంలా అనిపించింది. ఆలోచనల్లో ఎప్పటికో కునుకుపట్టింది.

మళ్ళీ మెలకువ వచ్చేరికి తెల్లగా తెల్లారింది.

"అన్నయ్యా! నీ కోసం ఎవరో వచ్చారు" తమ్ముడు పిలవటంతో క్రిందకు వెళ్ళి చూశాడు.


గుమ్మంలో మాష్టారి కొడుకు నిలబడివున్నాడు. 'అంటే మాష్టారు రాత్రి ఊరు వెళ్ళలేదన్నమాట. ఇప్పుడు వెళ్ళటానికి డబ్బుకోసం కొడుకుని పంపివుంటారు' అనుకుంటు తన గదిలోకి వచ్చి డబ్బు తీసుకువెళ్ళి అతని చేతిలో పెట్టబోయాడు.


కాని అతను తీసుకోలేదు. తన ముఖంలోకి సూటిగా చూశాడు. అతని కళ్ళ నిండుగా నీరు నిలిచివుంది. అంతకు ముందు వరకు ఎంతో ఏడ్చినట్టు కళ్ళు వాచివున్నాయి. ఎందుకో తనకు అర్ధంకాలేదు.

"ఈ సహాయం నిన్న చేసివుంటే యింత ఘోరం జరిగివుండేది కాదుసార్....!" అతి ప్రయత్నంమీద అతను అన్న ఆ మాటలకు తను కొయ్యబారి పోయాడు.

"ఏం జరిగింది?" ఎలాగో అడిగాడు.

"రండిసార్! చూద్దురుగాని" అతను ముందు నడుస్తుంటే అయోమయంగా అతనిని అనుసరించాడు తను.



రోడ్డంతా జనం, పోలీసులు. రోడ్డుమీద తెగిపోయిన కరెంట్-తీగలమధ్య మాష్టారి శవాన్ని చూసి తను షాక్ తగిలినట్టయ్యాడు.

"నిన్న సాయంత్రం నుండి నాలుగుసార్లు మీ యింటికి వచ్చారు సార్ నాన్నగారు. ఎప్పుడు వచ్చినా మీరు యింట్లో లేరని చెప్పారట మీ నాన్నగారు. రాత్రి తొమ్మిదింటికి వచ్చినప్పుడు యింకో గంటలో మీరు వస్తారని చెప్పారట.

నాకు ఎందుకో అనుమానంవచ్చి మీ గదివైపు చూశాను. మీ గదిలో లైటు వెలుగుతుండటంతో విషయం నాకు అర్థమయింది. ఆ మాటే నాన్నగారితో అంటే ఆయన వినిపించుకుంటేనా?"

మీరు రాగానే భోజనం చేసి పడుకుంటారు. తరువాత లేపితే బాగుండదు అని గాలి విపరీతంగా వీస్తున్నా మీ యింటికి బయలుదేరారు. ఒద్దని ఎంతచెప్పినా వినలేదు. కోపంవచ్చి నేను ఆయన వెంట రావటం మానేశాను. ఇంతలో వాన కూడా మొదలయ్యింది.

ఎంతసేపటికీ ఆయన తిరిగి రాకపోవటంతో నేను బయటకు వచ్చి చూస్తే ఇదిగో ఇలా వున్నారు. మీరు ఇస్తానన్నారు కనుక ఆశపడ్డారుసార్! కాని మీరు ఇంట్లో వుండే లేరనిపిస్తారని తెలుసుకోలేక పోయారు ఆయన. అందరినీ గుడ్డిగా నమ్మటం ఆయనకు అలవాటయిపోయింది." అతను ఎంత నెమ్మదిగా అంటున్నా, దగ్గరగా వుండి విన్న ఇద్దరు ముగ్గురు తనవంక అదోలా చూశారు.

ఎవరో గొడ్డలితో గుండెలమీద మోదుతున్నట్టుగా వుంది తనపరిస్థితి. కళ్ళు తిరిగాయి. ఇక అక్కడ నిలబడలేక తన ఇంటివైపు వచ్చేశాడు. తను ఆ పరిస్థితిలో ఏం చెప్పినా ఎవరు నమ్మరు. తను గడపలో అడుగుపెడుతుండగా హాలులో తండ్రి మాటలు వినిపించాయి.

"మనవాడిని డబ్బు అడగటం నేను విన్నాను. ప్రక్కవాళ్ళు కాస్త పచ్చగా కనబడితేచాలు అప్పులకని బయలుదేరుతుంది వెధవలోకం. ఇక ఆ అప్పులు తిరిగి ఇవ్వటం అనేది జరగదు.

రెండు వందలంటే మనవాడికి రెండు రూపాయల్లా వున్నాయి. ఎదుటి మనిషి తను ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వగలడా, లేదా అని ఆలోచించుకోడు. అడిగినవాళ్ళందరికి అప్పులిస్తే, ఈసరికి మనం పూరిపాకల పాలయ్యేవాళ్ళం. అందుకే ఆ బడిపంతులు ఎప్పుడు వచ్చినా రవి లేడని చెప్పాను" తను గుమ్మంలో నిలబడివుండటం చూసి తండ్రి మాటలు ఆగిపోయాయి.

"డాడీ! ఇదిగో మీరు కోరుకునే డబ్బు. కాని మాష్టారి ప్రాణం మాత్రం తిరిగిరాదు. ఆఖరిసారి కూడా నేను లేనని చెప్పకపోయారా...! ఇంకో గంటలో వస్తానని ఎందుకు చెప్పారు. ఆ నిండు ప్రాణం బలికాకుండావుండేది" తన చేతిలోని డబ్బు హాలు మధ్యగా విసిరేసి తన గదిలోకివచ్చి విసురుగా తలుపులు మూసుకున్నాడు.

అప్పటినుండి మనస్సు బాధతో నలిగిపోతోంది. తను ఎప్పటికీ నిందితుడేనేమో! తలుపు చప్పుడవ్వగానే తను వెళ్ళి చూసివుంటే యింత ఘోరం జరిగి వుండదు.

చిన్నప్పటినుండి ఎవరో చేసిన తప్పుకి తను నిందవహిస్తున్నాడు. ఎందుకీ శిక్ష తనకి? ఏం పాపం చేశాడని? చిన్నప్పుడు మాష్టారికే చెడ్డవాడు. ఇప్పుడు మాష్టారి కుటుంబానికి కూడా చెడ్డవాడయ్యాడు తను.

మరో పదిరోజులవరకు రవితేజ గది తలుపులు తెరుచుకోలేదు. తిన్నాడో, ఉన్నాడో ఎవ్వరికి తెలియదు.

పదో నాటికి మాష్టారి నిలువెత్తు ఫొటో అతని గదిలో వెలిసింది. దానికి పూలదండ అలంకరించబడింది.

రవితేజ మనస్సు అప్పటికి కాస్త కుదుటపడింది. ఆర్చులో మాష్టారు ఆనాడు నేర్పిన ఓ, న, మాలు దినదిన ప్రవర్ధమానమయి ఈనాడు యిందుకు పనికివచ్చాయి.

రవితేజ మాష్టారి పటంముందు చేతులు కట్టుకుని నిలుచుని "మాష్టారు! నిజంగా ఆనాడు, ఈనాడు మీకు జరిగిన అన్యాయానికి నేను కారకుణ్ణి కానుసార్...!" దుఃఖంతో పూడుకుపోయే కంఠంతో విన్నవించుకున్నాడు. □

ఈ 'వేమన' పద్యాలు

## కాషాయ బట్టలు




కాషాయ మమర గట్టిన
వేషములకు చిక్కి బువ్వ విడబడి తిరిగే
గోసాయి క్రియల తనువును
పోషించుట ముక్తి కాదు పూనకు వేమా.